కోరలు చాస్తున్న కాలుష్యం



కాలుష్యం కోరల్లో విశాఖ దక్షిణ నియోజకవర్గం

- దుమ్ము, ధూళితో దక్షిణం విలవిల
- భారీ వాహనాల రాకపోకలతో మరింత అధ్వానం
- దుస్థితిలో ఈ ప్రాంత పోలీస్‌స్టేషన్లు

దాబాగార్డెన్స్: విశాఖలోని దక్షిణ నియోజకవర్గంపై కాలుష్యం పడగ విప్పుతోంది. దానికి తోడు దుమ్ము విజృంభిస్తోంది. కాలుష్యం దెబ్బకు అనేక మంది రోగాల బారిన పడుతున్నారు. దక్షిణ నియోజకవర్గ ప్రజల్లో 60 నుంచి 70 శాతం మంది కాలుష్యం కారణంగా దశాబ్దాల నుంచి అవస్థలు పడుతున్నారు. జీవీఎంసీ 33, 34, 35, 36, 37, 38, 39, 41 వార్డుల్లోని కోటవీధి, చిలకపేట, ఫెర్రీరోడ్డు, పద్మానగర్, లక్ష్మీనగర్, టౌన్‌కొత్తరోడ్డు, రామకృష్ణావీధి, పెయిన్‌దొరపేట, థామ్సన్‌వీధి, వెలంపేట, ప్రసాద్‌గార్డెన్స్, పండావీధి, అల్లిపురం, కర్రలదొడ్డి, రామకృష్ణాజంక్షన్, కొబ్బరితోట, అంబేడ్కర్ కాలనీ, యాతపేట, కెప్టెన్ రామారావు జంక్షన్, సౌత్‌జైల్‌రోడ్డు, దొండపర్తి, జ్ఞానాపురం, కంచరపాలెం తదితర ప్రాంతాలతో పాటు విశాఖపట్నం పోర్టు ట్రస్ట్‌కు ఆనుకుని 5 నుంచి 10 కిలోమీటర్ల పరిధిలో నివసిస్తున్న ప్రజలు బొగ్గు గాలి, దుమ్ము గాలితో అవస్థలు పడుతున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ కాస్తున్నంత సేపూ ఫర్వాలేదు కానీ సాయంత్రం వేళల్లో వీస్తున్న గాలులకు ఈ ప్రాంతాలన్నీ దుమ్ముతో నిండిపోతున్నాయి. ఈ ప్రాంతంలో ప్రయాణించే భారీ వాహనాల రాకపోకలతో పరిసరాలన్నీ దుమ్మూ, ధూళితో నిండిపోతున్నాయి. పరిసరాల్లోని ఇళ్లు, ఇళ్లలోని సామగ్రి కూడా కాలుష్యానికి గురవుతున్నాయి. చివరికి తాగే నీరు.. తినే తిండి కూడా దుమ్ము పట్టిపోతున్నాయి. మంచినీరు తాగినా.. ఏ ఆహారం తిన్నా అనారోగ్యానికి గురై ఆస్పత్రి పాలవుతున్నారు.

దుమ్మూ, ధూళితో సతమతం

ఇక్కడి ఫెర్రీరోడ్డు, కోటవీధి, పోర్టు ప్రధాన రోడ్లను మాత్రమే నీటితో తడుపుతున్నారు. కోటవీధి, పద్మానగర్, లక్ష్మీనగర్, చాగంటివారి వీధి తదితర ప్రాంతాల ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. అల్పపీడనం.. తుపాన్లు వచ్చాయంటే చాలు. ఈ ప్రాంతమంతా దుమ్ము దుమారం రేగుతోంది. ఒక్క పాతనగరమే కాదు.. నియోజకవర్గ పరిధి జ్ఞానాపురం, కాన్వెంట్ జంక్షన్, కొబ్బరితోట, లక్ష్మీనగర్, రామకృష్ణావీధి, పండావీధి, పద్మానగర్, చిలకపేట తదితర ప్రాంతాల వాసులు దుమ్ముతో బాధపడుతున్నారు. శ్వాసకోస వ్యాధులు, చర్మవ్యాధులకు గురవుతున్నారు.

పోలీస్‌స్టేషన్లు కూడా

స్థానిక ప్రజలే కాదు.. పోలీస్ స్టేషన్లు కూడా కాలుష్యం బారిన పడుతున్నాయి. నియోజకవర్గ పరిధిలో గల వన్‌టౌన్, హార్బర్ పోలీస్ స్టేషన్‌తో పాటు రెండో పట్టణ పోలీస్ స్టేషన్, మహారాణిపేట పోలీస్ స్టేషన్ కూడా కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయి. ప్రమాదవశాత్తు/నిబంధనల ఉల్లంఘనతో పోలీసులకు వాహనాలు చిక్కితే.. వాటి సంగతి ఇక అంతే.. ఒక్క రోజులోనే ఆయా స్టేషన్లకు వెళ్లిన వాహనాలన్నీ నల్లటి దుమ్ము బారిన పడుతున్నాయి. స్టేషన్ల పరిస్థితి కూడా అలానే ఉంది. ఇటీవల పోలీస్ స్టేషన్లకు వేసిన పెయింట్లు ఎక్కడా కానరావడం లేదు. స్టేషన్లన్నీ బొగ్గు, కాలుష్యంతో నల్లగా కనిపిస్తున్నాయి.

కాలుష్యంతో సతమతం..



దక్షిణంలో చాలా ప్రాంతాలు దుమ్మూ, ధూళితో ఇబ్బందికరంగా ఉన్నాయి. ఫెర్రీ రోడ్డు, కోటవీధి, పోర్టు ప్రధాన రోడ్లను మాత్రమే నీటితో తడుపుతున్నారు. మిగిలిన వాటి సంగతి ఎవరూ పట్టించుకోవడంలేదు. కనీసం నీటితో తడపడం వల్ల గాలి వీచినప్పుడు దుమ్ము పైకి లేవదు. రెండు రోజులుగా బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వీస్తున్న గాలులతో దుమ్మూ, ధూళి రేగి సతమతం అవుతున్నాం. బయటికి రావడానికి కూడా ఇబ్బందికరంగా ఉంది. పిల్లలు, వృద్ధుల పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. ఇప్పటికైనా దీనిపై తగిన చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

పసగాడ రామలింగేశ్వరరావు, సామాజికవేత్త



కాన్వెంట్ జంక్షన్‌కు వెళ్లే రోడ్డులో దుమ్ము, ధూళితో నిండిన భారీ వాహనాలు



ట్రాఫిక్ పోలీసుల టూ వీలర్ (బ్లూకోట్ వాహనం) పరిస్థితి ఇలా..



ఇటీవల హార్బర్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న వాహనం దుస్థితి

రక్షణగిరిలో శిలువ మార్గ ప్రార్థనలు



రక్షణగిరిలో శిలువ మార్గాన్ని చూపిస్తున్న ఫాదర్ ఆనంద్

కంచరపాలెం: ఏసుక్రీస్తును ఆరాధిస్తూ భయభక్తులు కలిగి జీవించాలని జ్ఞానాపురం పునీత పేతురు ప్రధాన దేవాలయం ఫాదర్ ఆనంద్ అన్నారు. పాస్కా కాలాన్ని పురస్కరించుకుని శుక్రవారం పునీత పేతురు దేవాలయం రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ నేతృత్వంలో రక్షణగిరి పుణ్యక్షేత్రం వరకు పరిశుద్ధ శిలువ మార్గం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఏప్రిల్ 7న జరగనున్న గుడ్‌ఫ్రైడే వేడుకలకు రక్షణగిరిని ముస్తాబు చేస్తున్నట్లు ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాశ్ తెలిపారు. కార్యక్రమంలో పీపీసీ సభ్యులు బేతా జోసెఫ్, అధిక సంఖ్యంలో క్రైస్తవులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్ ఢీకొని సెక్యూరిటీ గార్డు మృతి

అల్లిపురం: ఆర్టీసీ బస్ ఢీకొని సెక్యూరిటీ గార్డు మృతి చెందిన ఘటన టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వన్‌టౌన్ కొత్తరోడ్డు ప్రాంతానికి చెందిన అండిబోయిన కోటేశ్వరరావు (60) సిరిపురం జంక్షన్‌లో గల ఖరాదీవాలాలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో స్కూటీపై విధులకు బయలుదేరాడు. పూర్ణామార్కెట్ నుంచి సీపీ కార్యాలయం జంక్షన్ వైపు వస్తుండగా, 28వ నంబర్ ఆర్టీసీ బస్సు అతనిని బలంగా ఢీకొట్టడంతో ఆయనకు బలమైన గాయాలయ్యాయి. దీంతో ట్రాఫిక్ కానిస్టేబుల్‌తో కలిసి ఆర్టీసీ బస్ సిబ్బంది గాయపడిన కోటేశ్వరరావును కేజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ అతను మరణించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

త్వరలో మిస్ అండ్ మిసెస్ ఉత్తరాంధ్ర పోటీలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ మంచ నాగమల్లేశ్వరి

సీతంపేట: రైతులు, చేనేత కళాకారులకు చేయూత నివ్వాలన్న సంకల్పంతో న్యూ హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మిస్ అండ్ మిసెస్ ఉత్తరాంధ్ర-2023 పోటీలు నిర్వహిస్తున్నట్టు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ మంచ నాగమల్లేశ్వరి తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్లు శుక్రవారం పౌరగ్రంథాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనే వారు ఏప్రిల్ 10వతేదీ లోగా 73370 97256, 73964 44404 ఫోన్ల నంబర్లకు సంప్రదించి నమోదు చేసుకోవాలని సూచించారు. కన్స్యూమర్ రైట్స్ కమిషన్ నేషనల్ చైర్మన్ డాక్టర్ సాయి రమేష్, రాష్ట్ర అదనపు కార్యదర్శి సురేష్‌నాయుడు, 2022 మిసెస్ ఉత్తరాంధ్ర విన్నర్ కొణతాల భాగ్య, మిస్ విశాఖ విన్నర్ గౌతమి, ఫౌండేషన్ డైరెక్టర్ సిద్ధు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశం

దొండపర్తి : టెక్ మహీంద్రా ఫౌండేషన్ సహకారంతో నిర్మాణ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు ఉన్న కోర్సుల్లో ఉచిత శిక్షణ అందించి ఉపాధి కల్పించనున్నట్లు నిర్మాణ్ సంస్థ డైరెక్టర్ మయూర్ పట్నాల తెలిపారు. ఇంటర్ పాస్, డిగ్రీ పూర్తయిన 18 నుంచి 28 ఏళ్లలోపు ఉన్న వారి అర్హులన్నారు. టైపింగ్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, ఇంట ర్నెట్ కాన్సెప్ట్స్, కమ్యూనికేటివ్ ఇంగ్లీష్, హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్, ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్, టెక్నికల్ స్కిల్స్, బేసిక్ అకౌంటింగ్ స్కిల్స్ కోర్సులో 3 నెలల పాటు ఉచిత శిక్షణ ఉంటుందని వెల్లడించారు. శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తామన్నారు. అర్హత గల అభ్యర్థులు ఎన్ఏడీ కొత్త రోడ్డు ప్రాంతంలో బాజీ జంక్షన్‌లో గల నిర్మాణ్ ఆర్గనైజేషన్ కేంద్రంలో కానీ 9502874304, 9908104113 ఫోన్ నెంబర్లకు ఈ నెల 18వ తేదీలోగా సంప్రదించాలని సూచించారు.

సకాలంలో 'నాడు-నేడు' పనులు పూర్తి

- డీఈవో చంద్రకళ ఆదేశం



విద్యార్థుల వర్క్‌బుక్స్‌ను పరిశీలిస్తున్న డీఈవో చంద్రకళ

విశాఖ విద్య: ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసేలా శ్రద్ధ తీసుకోవాలని డీఈవో ఎల్.చంద్రకళ ఆదేశించారు. నగరంలోని పలు స్కూళ్లలో శుక్రవారం ఆమె ఆకస్మిక తనిఖీలు చేశారు. గోపాలపట్నం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల-1లో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. పనులన్నీ ప్రారంభించి, సకాలంలో పూర్తి చేసేందుకు కృషి చేయాలని వార్డు ఇంజినీరింగ్ అసిస్టెంట్‌కు డీఈవో సూచించారు. మధ్యాహ్న భోజన పథకం తయారీ విధానాన్ని పరిశీలించి, నిర్వాహక ఏజెన్సీ వారితో మాట్లాడారు. రుచికరంగా నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలని సూచించారు. పాఠశాల రికార్డులను, విద్యార్థుల వర్క్ బుక్స్‌ను పరిశీలించారు. తరగతుల్లో డీసీఆర్, వీసీఆర్ వినియోగించకపోవడాన్ని గుర్తించిన ఆమె వీటిని క్రమం తప్పకుండా ఉపయోగించి రికార్డుల్లో నమోదు చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాల గేటు వద్ద చేపల దుకాణదారులు వ్యర్థాలు వేస్తున్నట్లు గమనించిన డీఈవో.. దీనిపై తగు చర్యల నిమిత్తం జోనల్ కమిషనర్‌తో ఫోన్‌లో చర్చించారు. ఏరియా శానిటరీ ఇన్‌స్పెక్టర్, మహిళా పోలీసు ద్వారా గోపాలపట్నం ఎస్ఐ దృష్టికి సమస్యను తీసుకెళ్లి, పాఠశాల గేటు వద్ద వ్యర్థాలు పడేయకుండా దుకాణదారులతో మాట్లాడాలన్నారు. ఇటువంటి వ్యర్థాల వల్ల విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని, దీనిపై సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది జోక్యం చేసుకోవాలని డీఈవో చంద్రకళ సూచించారు.

'పోర్ట్ హాస్పిటల్ ప్రైవేటీకరణ తగదు'


తాటిచెట్లపాలెం: విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్‌లో విధులు నిర్వర్తించే ఎంతో మందికి వైద్య సేవలందించిన, ప్రస్తుతం అందిస్తున్న పోర్ట్ గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్‌ను ప్రైవేటుకు అప్పగించే ఆలోచనను విరమించాలని పోర్ట్ పెన్షనర్లు కోరారు. ఈ మేరకు శుక్రవారం కైలాసపురం దరి శాంతిపురంలో సమావేశం నిర్వహించారు. ఇటీవల జరిగిన రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్(పోర్ట్ పెన్షనర్స్) సమావేశంలో ఈ మేరకు తీర్మానించామని, దీనిపై కోర్టు ఇచ్చిన స్టేను అమలు చేయాలన్నారు. పోర్ట్ హాస్పిటల్‌లో ఆరు నెలలుగా రిటైరైన వారి స్థానంలో కొత్తవారిని నియమించలేదని, వెంటనే నియామకాలు చేపట్టాలని సూచించారు. పోర్టు యాజమాన్యం తన ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోకుంటే భవిష్యత్తులో మరిన్ని నిరసన కార్యక్రమాలు చేపడతామని అసోసియేషన్ ప్రతినిధులు హెచ్చరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎ.ఎం.ఫ్రెడ్డీ, సెక్రటరీ ఎం.ఎస్.ఆర్. గుప్తా, కోశాధికారి డి.వెంకటేశ్వరరావు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా మందిర వార్షికోత్సవం

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్‌లో సద్గురు షిర్డీ సాయిబాబా మందిర వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. విశాలాక్షినగర్, చలపతినగర్, జోడుగుళ్లపాలెం, హనుమంతవాక ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు.. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మేయరు గొలగాని హరివెంకటకుమారి, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, వార్డు కార్పొరేటర్ స్వాతి.. బాబాను దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు తారానాథ్ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రుద్రరాజు రమేష్, ముకేష్, వేజెళ్ల సుబ్బరాజు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఈవో శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఈవో శిరీషతో పాటు ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ వర్కర్లకు శిక్షణ



ఆశ వర్కర్లకు శిక్షణ ఇస్తున్న శిక్షకురాలు చిన్ని

అల్లిపురం: ఆశ వర్కర్లకు ఐదు రోజుల పాటు కొబ్బరితోటలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా వారికి కళ్లు, ముక్కు, చెవులు, నోరు, గొంతు యందు వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ అందిస్తున్నారు. శిక్షకురాలు చిన్ని ఆశ వర్కర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు పాల్గొన్నారు.


అలరించిన కర్ణాటక గాత్ర కచేరీ



కీర్తనలు ఆలపిస్తున్న అరుణమణి, గాయత్రి

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో శుక్రవారం నిర్వహించిన కర్ణాటక గాత్ర కచేరీ ఆహూతులను అలరించింది. ఎస్.శ్రీవిద్య శిష్యులు ఎస్.అరుణమణి, కె.గాయత్రి సుమద్యుతి మృదు మధుర గానంతో అన్నమయ్య, త్యాగరాజ, ముత్తుస్వామి దీక్షితార్ కీర్తనలు ఆలపించి ప్రేక్షకులకు వీనులవిందు చేశారు. సిద్ధిం దేహి మే, లలితా పంచకం, సర్వ మంగళాధవ, కమలాష్టకుల, మాయమ్మ అలమేలు మంగ శ్రీగురుగుహ, వలపులు వలపులు, హరి నీప్రతాపము, జయ జయ దుర్గే, జయజయ జయహే కీర్తనలు శ్రావ్యంగా పాడారు. వీరికి ఎస్.కృష్ణప్రియ వయోలిన్‌పై, టి.ఎస్.చైతన్య మృదంగంపై వాద్య సహకారం అందించారు. అనంతరం గాయకులను లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ సత్కరించారు. ఏకాదశి సందర్భంగా శనివారం ఉదయం 5 గంటలకు లలితా పీఠంలో కల్యాణ శ్రీనివాసుడికి సుప్రభాత సేవ, 6 గంటలకు విశేష అభిషేకం జరుగుతాయని ఆయన చెప్పారు.

వేడుకగా అప్పన్న కల్యాణం



యజ్ఞోపవీతం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు శ్రీకాంత్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

వైద్య విద్యార్థుల రక్తదానం



వైద్య విద్యార్థులను అభినందిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్

మహారాణిపేట : కేజీహెచ్ రక్తనిధిని హౌస్ సర్జన్లు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు కూడా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు టి.కీర్తిశ్రీ, బి.షరన్, వైష్ణవి తదితరులను సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్ అభినందించారు. 57 మంది హౌస్ సర్జన్లు రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్నట్టు కేజీహెచ్ రక్తనిధి వైద్య అధికారులు డాక్టర్ సునీతారాణి పాత్రో, డాక్టర్ ఎస్‌సీబీ నాయుడు తెలిపారు. వైద్యులు స్వయంగా రక్తదానం చేయడం స్ఫూర్తిదాయకమని సూపరింటెండెంట్ కొనియాడారు. ఎంబీబీఎస్‌లో విద్యార్థి దశ అత్యంత కీలకమని.. అప్పుడే క్లిష్టమైన బాధ్యతలు హౌస్ సర్జన్లకు ఉంటాయని డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ అన్నారు. అయినా వారు వచ్చి రక్తదానం చేయడం హర్షణీయమన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్‌కుమార్ వైద్య విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు.

చురుగ్గా ఫీవర్ సర్వే



ఫ్రైడే-డ్రైడేపై అవగాహన కల్పించి ఫీవర్ సర్వే చేస్తున్న మలేరియా సిబ్బంది, ఆశ వర్కర్



బ్లడ్ శాంపిల్ సేకరిస్తున్న మలేరియా సిబ్బంది

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డులో ఫీవర్ సర్వే చురుగ్గా జరుగుతోంది. వార్డు మలేరియా సూపర్‌వైజర్లు అప్పారావు, మురళీ, ఆశ వర్కర్ పార్వతితో కలసి డోర్ టు డోర్ తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. వారంలో ఒక రోజు డ్రైడే పాటించాలని సూచించారు. ఇంట్లోని మనీప్లాంట్లలో నీటిని ఎప్పటికప్పుడు మార్చుకోవాలని, మంచినీటి డ్రమ్ములు ఆరబెట్టుకోవాలని సూచించారు. ఇంట్లో వాడేసిన కొబ్బరిబోండాలు, పాతటైర్లు ఉంచరాదని, వాటిలో నిలువవున్న నీటిని శుభ్రపరచాలని కోరారు. అలా నిలువ ఉన్న నీటిలో దోమల లార్వాలు పెరగకుండా తగిన మందులు వేయాలని కోరారు.

ఇంటింటి సర్వే

వాతావరణ మార్పుల వలన వస్తున్న జ్వరాల పట్ల ఇంటింటి సర్వే చేసిన మలేరియా సిబ్బంది, వారికి తగిన సూచనలు, సలహాలు అందజేశారు. జ్వరంతో బాధపడుతున్న వారి నుంచి బ్లడ్‌శాంపుల్స్ సేకరించి పరీక్షలు నిర్వహించారు.

ఇన్‌చార్జిలకు సత్కారం



పార్టీ అనుబంధ విభాగాల ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కరరెడ్డిని సత్కరిస్తున్న మన్యాల

దాబాగార్డెన్స్: ఎమ్మెల్సీ, రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడు జంగా కృష్ణమూర్తిని, రాష్ట్ర అనుబంధాల విభాగాల ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కరరెడ్డిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్ శుక్రవారం సత్కరించారు. విజయవాడ పార్టీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్రంలో వెనుకబడిన కులాల సమగ్రాభివృద్ధికి మనం ఏవిధంగా కష్టపడాలి.. 2024లో మనమంతా ఏ విధంగా జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చెయ్యాలి అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో మన్యాల శ్రీనివాస్ విశాఖ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడిగా పాల్గొన్నారు.

వైద్య విద్యార్థినికి అభినందనలు



డాక్టర్ సింధూజను అభినందిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు తదితరులు

మహారాణిపేట : ఏపీ, తెలంగాణ రాష్ట్ర సదస్సులో డాక్టర్ ఎస్.సింధూజ ప్రతిభను ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. బుచ్చిరాజు, మైక్రోబయాలజీ హెచ్‌వోడీ డాక్టర్ పి.కమల, మైక్రోబయాలజీ ప్రొఫెసర్ డాక్టర్ పి.రత్నకుమారి కొనియాడారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ మెడికల్ మైక్రోబయాలజీ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కంబైన్డ్ చాప్టర్ 26వ రాష్ట్ర కాన్ఫరెన్స్ ఇటీవల హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా మైక్రోబయాలజీలో డాక్టర్ సింధూజ 2వ పీజీ క్విజ్ పోటీలో ద్వితీయ బహుమతి పొందారు.

'భిన్న వాతావరణాలను తట్టుకునేలా నిర్మాణాలు'



సదస్సును ప్రారంభిస్తున్న ఆచార్య సత్యనారాయణరెడ్డి

ఏయూ క్యాంపస్: సముద్రతీర ప్రాంతాలలో వైవిధ్యమైన వాతావరణ పరిస్థితులు ఉంటాయని, వీటిని తట్టుకుని నిలిచే విధంగా నిర్మాణాలు చేపట్టాలని ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఆచార్య సి.ఎస్.వి సత్యనారాయణ సూచించారు. ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో 'రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ సివిల్ ఇంజినీరింగ్'అంశంపై శుక్రవారం జరిగిన ఒక రోజు సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కొండవాలు ప్రాంతాలలో జరిగే నిర్మాణాలో తీసుకోవలసిన జాగ్రత్తలు ఎంతో కీలకమన్నారు. సాగర్ సిమెంట్స్ సీనియర్ మేనేజర్(టెక్నికల్ సర్వీసెస్) జనార్దన్ అరుణాచలం మాట్లాడుతూ విభిన్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సిమెంట్ నిర్మాణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. ఐఐటీ మద్రాస్ సివిల్ ఇంజినీరింగ్ పూర్వ ఆచార్యుడు కె.రాజ గోపాల్ మాట్లాడుతూ జియో సింథసిటిక్ మెటీరియల్‌తో నిర్మించిన కన్నూర్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణ వివరాలను తెలియజేశారు. ఈ సదస్సులో గర్‌వారి వాల్ ఫైబర్ లిమిటెడ్(పూణే) ప్రతినిధి రమేష్ చెట్టి, కెల్లర్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ వై.హరికృష్ణ, విభాగ ఆచార్యులు డాక్టర్ ఐ.శివపార్వతి పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా శశిభూషణరావు



వీసీ ప్రసాదరెడ్డి నుంచి ఉత్తర్వులు స్వీకరిస్తున్న ఆచార్య జి.శశిభూషణరావు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆచార్య జి.శశిభూషణరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి నుంచి ఆయన శుక్రవారం నియామక ఉత్తర్వులు స్వీకరించారు. అనంతరం ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆచార్య శశిభూషణరావును ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎ.కిషోర్‌బాబు, పలువురు ఆచార్యులు అభినందించారు.

సామూహిక కుంకుమార్చన

ఎంవీపీ కాలనీ: టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్(డీపీపీ) ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని డీపీపీ కార్యాలయంలో శుక్రవారం భక్తి శ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. స్థానిక మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య పూజలు చేశారు. అనంతరం పలువురు మహిళలు ఆలపించిన అన్నమయ్య కీర్తనలు అలరించాయి.